
సాక్షి అనంతపురం

శనివారం ׀ 11 ׀ మార్చి ׀ 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



టమాట కిలో రూ.21

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.21, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.9 పలికింది.

గరిష్టం/కనిష్టం

36.3°/13.1°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా మండలాల్లో చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

నేటితో ప్రచారానికి తెర




అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. అటు తరువాత అభ్యర్థులు, వారి తరఫున ఇతరులెవరు ప్రచారం చేసినా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘన కిందకు వస్తుంది. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేకు శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి మండల, మునిసిపల్ స్థాయిలోని ఎంసీసీ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించనున్నాయి. ఎక్కడైనా అభ్యర్థులు, వారి తరఫున ఇతరులెవరైనా ప్రచారం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తిస్తే ఎంసీసీ ఉల్లంఘన కింద కేసు నమోదు చేస్తారు.

బీటెక్, బీఫార్మసీ ఫలితాలు విడుదల



అనంతపురం: అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్16) పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య చంద్రమోహన్ రెడ్డి ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్19), బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్15), బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్19) సప్లిమెంటరీ, బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ, బీఫార్మసీ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్http://jntuarerults.ac.inను సంప్రదించాలని సూచించారు.

పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

రాప్తాడు: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేయాలని డీఈఓ సాయిరాం పిలుపునిచ్చారు. రాప్తాడు కేజీబీవీలో శుక్రవారం జిల్లాలోని కేజీబీవీల ఎస్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. స్టడీ అవర్స్ నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోని కేజీబీవీల్లో 'అనంత'ను మొదటి స్థానంలో నిలిపేందుకు ఎస్‌ఓలు సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ వంద శాతం ఉత్తీర్ణత రావాలన్నారు. వంద శాతం రాని పాఠశాలల బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'అనంత సంకల్పం' కార్యక్రమం పక్కాగా అమలు కావాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ కంప్లైంట్ బాక్స్‌లు పెట్టాలని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం డీఈఓ ఎనిమిదో తరగతి గదికి వెళ్లి బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఖాతా.. ఖాళీ



కష్టపడి సంపాదించిన సొమ్మును సైబర్ నేరగాళ్లు టెక్నాలజీ సాయంతో దోచేస్తున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన వీరు అమాయకులను, చదువుకోని వారిని మోసం చేస్తున్నారు. ఆరు గాలం శ్రమించి కష్టపడ్డ సొమ్మును క్షణాల్లో కొట్టేస్తున్నారు. ఈ సైబర్ నేరగాళ్ల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. బాధిత ఖాతాదారులు లబోదిబోమంటున్నారు.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- బ్యాంకు ఖాతాదారుల సొమ్ముపై కన్ను
- ఆధార్ హ్యాక్.. వేలిముద్రల జిరాక్స్‌తో లూటీ
- డెబిట్/విత్ డ్రా మెసేజీలతో బాధితుల బెంబేలు
- బ్యాంకులు, పోలీస్ స్టేషన్లకు క్యూ కడుతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో రోజూ వందల సంఖ్యలో ఫిర్యాదులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చిరు వ్యాపారులు, కూలీలు, సన్నచిన్నకారు రైతులు, కార్మికులు తదితరులు అక్కరకు వస్తుందని చిన్నపాటి మొత్తమైనా బ్యాంకులో దాచుకుంటున్నారు. అలాంటి సొమ్ము ఉన్నఫళంగా మాయమవుతోంది. బ్యాంకులో ఉంటే భరోసా ఉంటుందన్న నమ్మకం కాస్తా సడలిపోతుంటే బాధితులు విలవిలలాడిపోతున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ ఖాతాల్లోని నగదే ఎక్కువగా గల్లంతవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు, పోలీస్‌స్టేషన్లకు వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి.

ఆధార్ సేకరించి... వేలిముద్రలు జిరాక్స్ చేసి..

ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాదారులు వేలిముద్ర వేసి.. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ద్వారా రోజుకు రూ.10 వేల వరకు డ్రాచేసుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని సైబర్‌నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకున్నారు. రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లోగానీ, మరెక్కడైనా గానీ వేలిముద్రలు వేస్తే వాటిని స్కాన్ చేసి ఇలా డబ్బు కొల్లగొడుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వెబ్‌సైట్ల నుంచి వేలిముద్రలు సేకరించి.. వాటిని పోలిన విధంగా మరో వేలిముద్రను తయారు చేస్తున్నారు. రోజూ ఇలా వందలాదిమంది ఖాతాల నుంచి రూ.లక్షల్లో నగదు మాయమవుతోంది.

మెసేజ్‌లు, లింక్‌లు ఓపెన్ చేయొద్దు

మొబైల్‌కు వచ్చిన కొత్త మెసేజ్ లింక్‌లు, యాప్‌లు ఓపెన్ చేయొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తెలియని కొరియర్ సర్వీసు వాళ్లు ఓటీపీ అడిగితే చెప్పవద్దని, మొబైల్‌లో లింకులు ఓపెన్ చేయగానే సమాచారం హ్యాక్ చేసే వీలుందని పేర్కొంటున్నారు. ఎక్కడైనా ఇటీవలి కాలంలో వేలిముద్రలు వేసిన సందర్భాలుంటే అక్కడకు వెళ్లి ముద్రలను డీలింక్ చేసుకోవాలని కూడా హెచ్చరిస్తున్నారు. ఖాతాల నుంచి డబ్బు గల్లంతైన బాధితుల నుంచి ఫిర్యాదు అందిన తర్వాత సొమ్ము రికవరీకి 45 రోజుల సమయం పడుతుందంటున్నారు.

ఎం ఆధార్ యాప్‌తో భద్రత

చాలాచోట్ల వేలి ముద్రల (ఫింగర్ ప్రింట్) వల్లే డబ్బులు పోతున్నాయి. ఇప్పుడు కొత్తగా ఎం ఆధార్ యాప్ వచ్చింది. ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్‌చేసుకుని కుటుంబ సభ్యులందరి ఆధార్ వేలిముద్రలు లాక్ చేసుకోవచ్చు. ఒక్కసారి లాక్ అయ్యాక ఎక్కడా ఓపెన్ కావు. మనం వేలిముద్ర వేయాలన్నా.. ఈ లాక్‌ను అన్‌లాక్ చేస్తే తప్ప ఓపెన్ కాదు. అవసరం ఉన్నప్పుడు అన్‌లాక్ చేసుకుని పని పూర్తవగానే మళ్లీ లాక్ చేసుకుంటే ఆధార్ అనుసంధానం అవ్వడం వల్ల ఎప్పుడూ డబ్బును కోల్పోయే అవకాశం ఉండదు.

బ్యాంకులో సొమ్ముకే భద్రత కరువు

నేను అనంతపురంలోని తపోవనం ప్రభుత్వ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తాను. నా అకౌంట్ నుంచి ఈ నెల 8వ తేదీ సాయంత్రం రూ.10వేలు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. బ్యాంకులో సొమ్ముకే భద్రత లేకపోతే ఇక ఏం చేయాలి? –విశ్వమూర్తి, హిందీ పండిట్

రూ.60 వేలలో రూ.20వేలే రికవరీ



నాకు ట్రెజరీ కార్యాలయంలో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతా ఉంది. ఈ మధ్యకాలంలో రూ.60 వేలు ఖాతా నుంచి పోయింది. ఫిర్యాదు ఇచ్చిన తర్వాత రూ.20వేలు రికవరీ అయ్యింది. మిగతా సొమ్ము ఇంకా రాలేదు.

–శ్రీనివాసులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి

ఉన్నట్టుండి రూ.10 వేలు పోయింది



నేను చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటాను. ఈ నెల ఏడో తేదీ రాత్రి ఉన్నట్టుండి బ్యాంకు అకౌంటు నుంచి రూ.10 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంకుకెళితే ఆధార్ లింకు ద్వారా పోయి ఉండొచ్చన్నారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాను.

–వెంకటేసు, చిరువ్యాపారి

త్వరలో కేంద్రం నిర్ణయం



మన జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆధార్ ఎనేబుల్డ్ సర్వీసెస్ ద్వారా ఫింగర్ ప్రింట్స్ సేకరించి బ్యాంకు ఖాతాల్లోంచి సొమ్ము హ్యాక్ చేస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులతో కేంద్ర హోం శాఖ సమావేశం నిర్వహించింది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనుంది. బాధితుల నుంచి సకాలంలో అందిన ఫిర్యాదుల ఆధారంగా సొమ్ము రికవరీకి కృషి చేస్తున్నాం. – ఫక్కీరప్ప, ఎస్పీ, అనంతపురం

నులిపురుగుల నివారణ ఎంతో అవసరం



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం సప్తగిరి సర్కిల్: చిన్నారుల్లో రక్తహీనత నిర్మూలనకు నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నులిపురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. ఏడాది పైనున్న చిన్నారులందరికీ అల్బెండజోల్ మాత్ర అందించాలన్నారు. మొదటి, రెండవ ఏడాది చిన్నారులకు అర మాత్రను ఒక గ్లాసు నీటితో కలిపి, రెండేళ్ల నుంచి 19 ఏళ్ల లోపు ఉన్న వారందరికీ ఒక మాత్రను భోజనం పూర్తయిన అరగంట తరువాత అందించాలని సూచించారు. మాత్రను తప్పనిసరిగా చప్పరించేలా సూచనలు చేయాలన్నారు. జ్వరం, జలుబు, అనారోగ్య సమస్యలు ఉన్నట్లయితే వాటి నుంచి ఉపశమనం పొందిన తరువాత అల్బెండజోల్ మాత్ర అందించాలని తెలిపారు. చిన్నారుల్లో ప్రధానంగా రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనత, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు నులిపురుగుల ద్వారా వస్తాయన్నారు. ప్రభుత్వం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14 అల్బెండజోల్ మాత్రలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి, మెడికల్ అధికారులు నారాయణస్వామి, చెన్నకేశవులు, సుజాత, నగర కమిషనర్ భాగ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూకొఠారి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మొహమ్మద్ రఫీ, డీఈఓ సాయిరాం, మహిళా సాధికారత అధికారి శ్రీదేవి, మేనేజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- మైక్రో అబ్జర్వర్లకు కలెక్టర్ నాగలక్ష్మి దిశా నిర్దేశం

అనంతపురం సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా మీరిచ్చే నివేదిక ఆధారంగానే ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో లోపాలు లేదా సమస్యలు తమ దృష్టికి వస్తే వెంటనే ప్రిసైడింగ్ అధికారితో చర్చించి అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ రోజున ఉదయం 7 గంటలకే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రీ పోలింగ్ సమయంలో చేపట్టే సన్నాహక కార్యక్రమాలతో పాటే మైక్రో అబ్జర్వర్ల పని కూడా మొదలవ్వాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఎన్నికల కమిషన్ పరిశీలిస్తూ ఉంటుందని, పోలింగ్ కేంద్రాల్లో అప్రజాస్వామిక పద్ధతులు చోటు చేసుకుంటే మైక్రో అబ్జర్వర్లు చూస్తూ ఊరుకోకూడదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే మైక్రో అబ్జర్వర్లపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజ రావు తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల' బ్యాలెట్ పేపర్లు వచ్చేశాయ్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లు అనంతపురం చేరాయి. జిల్లాల వారీగా ఓటర్ల సంఖ్య మేరకు బ్యాలెట్ పేపర్ల ప్యాకింగ్ ప్రక్రియను ఎన్నికల సిబ్బంది శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో చేపట్టారు. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 3,30,124 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 68,341 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 43,310 మంది, కర్నూలులో 62,633 మంది, నంద్యాలలో 54,929 మంది, వైఎస్సార్‌లో 81,317 మంది, అన్నమయ్య జిల్లాలో 20,594 మంది ఓటర్లు ఉన్నారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లను ఇప్పటికే జిల్లాల వారీగా ప్యాకింగ్ చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచారు. ఉపాధ్యాయ నియోకవర్గం పరిధిలో మొత్తం 28,148 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 5,564 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 348 మంది, కర్నూలులో 5,391 మంది, నంద్యాలలో 4,426, వైఎస్సార్‌లో 7,461 మంది, అన్నమయ్య జిల్లాలో1,958 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను బందోబస్తుతో శనివారం ఆయా జిల్లాలకు పంపించనున్నారు.

ఎన్నికల్లో కోవిడ్ నిబంధనలు పాటించాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోవిడ్ నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మాస్క్ ధరించడం, భౌతిక దూరాన్ని పాటించడం, శానిటైజర్, సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు బూస్టర్ డోస్ సర్టిఫికెట్లు వెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద అత్యవసర మందులతో పాటు వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కోవిడ్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

ప్రైవేట్ పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

రాప్తాడురూరల్: విద్యా హక్కు చట్టం -2009, ఉచిత నిర్బంధ విద్య బాలల హక్కు నియమావళి- 2010 మేరకు 25 శాతం సీట్ల కేటాయింపులో భాగంగా 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలన్నీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఈఓ ఎం.సాయిరాం ఆదేశించారు. ఐబీ, ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలు http://cse.ap.gov.in. పోర్టల్ లో ఈ నెల 16లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ సమర్పించే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని కలెక్టరేట్ 'స్పందన' కౌంటర్‌లో ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించనున్న ఉద్యోగుల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12ని ఇప్పటి వరకు దాదాపు 120 మంది ఉద్యోగులు సమర్పించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్రం ఏర్పాటు చేసినట్లు వారందరికీ ఫోన్ ద్వారా అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో 43 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రానికి నేరుగా వచ్చి ఓటు వేయని వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా బ్యాలెట్ పేపర్ పంపించే ప్రక్రియను సిబ్బంది చేపట్టారు.

అయోమయంలో పోలీసు సిబ్బంది

ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొననున్న పోలీసులు తమకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించలేదని వాపోతున్నారు. తమకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని అధికారుల కల్పిస్తారా లేదా అనే అయోమయంలో ఉన్నామని పలువురు చెబుతున్నారు.



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

పోలింగ్ సామగ్రి జాగ్రత్తగా పంపిణీ చేయాలి

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపణీ జాగ్రత్తగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపణీ కౌంటర్లను కలెక్టర్ శనివారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బందికి భోజన వసతి, రవాణా, కళాశాల ఆవరణలో పార్కింగ్, తదితర ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, పర్యాటక అధికారి నాగేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి, ఆర్‌టీఓ సురేష్‌నాయుడు పాల్గొన్నారు.



మోహినీ రూపాయా.. ఖాద్రీశా

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం శ్రీవారు కుచ్చుల వాలు జడతో మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తమ ఇలవేల్పును కనులారా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చంకన అమృత భాండాగారాన్ని పెట్టుకొని సుకుమార వేషంలో శ్రీవారు దర్శనమివ్వగా... చూడడానికి భక్తుల రెండు కళ్లు సరిపోలేదు. ధగ ధగా మెరిసే పట్టు చీరలో అందరినీ ఆకట్టుకొనే స్వామి వారిని గుభాళించే కదిరి మల్లెలతో అలంకరించారు. ఉభయదారులుగా పట్టణానికి చెందిన కోటా వెంకట సుబ్బయ్య శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు.

◄ మోహినీ అవతారంలో లక్ష్మీ నారసింహుడు

క్లుప్తంగా

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు

అనంతపురం అగ్రికల్చర్: రబీలో రైతులు పండించిన పప్పుశనగను ఆర్‌బీకే వేదికగా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాలు రూ.5,335 ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటికే పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం, విడపనకల్లు, బెళుగుప్ప కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఇవి కాకుండా పంట పండించిన ప్రాంతాల్లో ఇంకా 23 కొనుగోలు కేంద్రాలు రెండు మూడు రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికే సీఎం యాప్‌లో 4 వేల మందికి పైగా రైతులు పప్పుశనగ కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ-క్రాప్ డేటా ఆధారంగా జిల్లా నుంచి 19 వేల మెట్రిక్ టన్నుల వరకు పప్పుశనగ సేకరణకు అనుమతి ఉందన్నారు. కొనుగోలు చేసిన 20 రోజులకు ఆన్‌లైన్ ద్వారా నేరుగా రైతు బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ అవుతుందన్నారు. ఒక రైతు నుంచి రోజుకు గరిష్ఠంగా 25 క్వింటాళ్ల వరకు కొంటామన్నారు.

- ట్యాబ్‌ల పంపిణీతో పేద విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ బోధన
- జిల్లాలో 21,954 మంది విద్యార్థులకు లబ్ధి
- 3,317 మంది టీచర్లకూ ట్యాబ్‌లు
- ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్ కోసం జిల్లాలో రూ.83.20 కోట్ల ఖర్చు

నవశకానికి నాంది

'నాడు - నేడు' ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను పంపిణీ చేయడం ద్వారా నవశకానికి నాంది పలికింది. ప్రభుత్వ బడుల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడంతో పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయని విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.



ట్యాబ్‌లలో పాఠాలు వింటున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన ప్రమాణాలతో విద్యను బోధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడేందుకు అధునాతన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రముఖ ఎడ్యుకేషన్ టెక్ కంపెనీ బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలు మెరుగుపరిచేలా వినూత్న కార్యక్రమాలు, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈ లెర్నింగ్‌కు బైజూస్‌తో ఒప్పందం

రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యారంగ దిగ్గజం బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.కోట్లు వెచ్చించి ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్‌ను ఇంగ్లిష్, తెలుగులో నిక్షిప్తం చేసింది. రూ.15 వేలు విలువైన ట్యాబ్‌లను విద్యార్థులు, బోధించే టీచర్లకు ఉచితంగా సరఫరా చేసింది. బైజూస్ కంటెంట్, ఓటీజీ, పౌజు కోసం రూ. 17 వేలు ఖర్చు చేసింది. ఒక్కో ట్యాబ్ కోసం రూ. 32 వేలు ఖర్చు చేస్తోంది. జిల్లాకు 26 వేల ట్యాబ్‌లు వచ్చాయి. ఇందుకోసం రూ. 83.20 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇప్పటి దాకా 494 స్కూళ్లలో 21,954 మంది విద్యార్థులు, 3,317 మంది టీచర్లకు ట్యాబ్‌లు అందజేశారు.

ట్యాబ్‌లో పాఠాలు

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లో 8, 9 తరగతులకు సంబంధించిన గణిత, భౌతిక, జీవ, రసాయనశాస్త్రాలు, చరిత్ర, భూగర్భ, పౌరశాస్త్రాల సబ్జెక్టుల పాఠాలు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఉన్నాయి. పాఠశాలల్లో అనుసరించే పాఠ్య పుస్తకాల్లో అధ్యాయాల వారీగా కంటెంట్ ఇండెక్స్‌ను పొందుపరిచారు. ప్రతి అధ్యాయం కాన్సెప్ట్‌లుగా విభజించి ప్రతి కాన్సెప్ట్‌ను 2 నుంచి 4 నిమిషాల వ్యవధితో వీడియోలుగా రూపొందించారు. మొత్తం 300 వీడియోలతో పాటు 57 అధ్యాయాలు, 472 కాన్సెప్ట్‌లు ఉన్నాయి.

ప్రశ్నపత్రాలు సైతం సులభంగా..

ఆయా సబ్జెక్టులకు సంబంధించి సుమారు 168 ప్రశ్న పత్రాలు ట్యాబ్‌లో ఉన్నాయి. విద్యార్థులు పాఠ్యాంశాలను వీడియో ద్వారా చూసి నేర్చుకోవడంతో పాటు ప్రశ్నపత్రాల ద్వారా తమను తాము పరీక్షించుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా అభ్యసనా సామర్థ్యాన్ని ఎవరికి వారే పెంపొందించుకోవడానికి దోహదపడుతుంది. తెలియని అంశాలు, సందేహాలను తరగతి గదిలో ఒకట్రెండు సార్లు మాత్రమే ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు తమ సందేహాలను ఎప్పుడైనా..ఎక్కడైనా నివృత్తి చేసుకోవచ్చు. దీంతో వెనుకబడిన విద్యార్థులు సైతం చదువులో రాణిస్తారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సులువుగా నేర్చుకుంటున్నాం



టీచర్లు చెప్పే పాఠాలతో పాటు ట్యాబ్ ద్వారా ఇంటి వద్ద పాఠాలను చదువుతున్నాము. ట్యాబ్‌లోని పాఠాలు ఇంగ్లిష్, తెలుగు రెండింటిలోనూ ఉన్నాయి. గణితం, భౌతిక, జీవ, రసాయన శాస్త్రాలు, చరిత్ర సబ్జెక్టులు విడివిగా పూర్తి సమాచారంతో ఉండటంతో సులువుగా నేర్చుకుంటున్నాం.
– తరణి, ప్రవల్లిక, 8వ తరగతి జెడ్పీహెచ్‌ఎస్ పాపంపేట, అనంతపురం

బాగా అర్థమవుతున్నాయి



'ట్యాబ్'లో నిక్షిప్తం చేసిన పాఠాలు బాగా అర్థమవుతున్నాయి. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉన్నాయి. పాఠం అర్థం కాకపోతే ఎన్నిసార్లు అయినా వినే అవకాశం ఉండటంతో సులువుగా అర్థమవుతున్నాయి.
– షేక్ రెహానా, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ పాపంపేట, అనంతపురం

పిల్లలకు చాలా ఉపయోగం



బైజూస్ కంటెంట్ విధానం పిల్లలకు భవిష్యత్తులో చాలా ఉపయోగంగా ఉంటుంది. ట్యాబ్‌లోనే పిల్లలు టెస్టులు రాసేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. మంచి స్పందన వస్తోంది. పూర్తిస్థాయిలో ఫలితాలు రావడానికి కాస్తా సమయం పట్టొచ్చు. పిల్లలు కూడా ఆసక్తిగా బైజూస్ కంటెంట్ వింటుండటం శుభ పరిణామం. సబ్జెక్ట్ టీచర్లు మరింత దృష్టి పెట్టాలి. వారికి శిక్షణ కూడా ఉంటుంది.
– ఎం.సాయిరాం డీఈఓ

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



కళ్యాణదుర్గం: మారెంపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



జిల్లా ప్రజా రవాణాధికారి సుమంత్‌ను ఓటు అభ్యర్థిస్తున్న మండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తదితరులు

కళ్యాణదుర్గం: ఈనెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కళ్యాణదుర్గం పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్సీ వాల్మీకి మంగమ్మ, ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్ గౌడ్‌లతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఓటు నమూనా బ్యాలెట్లు అందజేసి ఓటు అభ్యర్థించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలన్నారు. సమర్థులకు ఓటు వేస్తే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో లక్షల కోట్ల పెట్టుబడులకు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, రూరల్ సచివాలయ కన్వీనర్ ఆంజినేయులు, షేక్షావలి, మమత, గోళ్ల మోహన్‌రెడ్డి, సర్వోత్తమలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని మండలి విప్, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజారవాణా కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ (ఆర్టీసీ)లలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలి విప్, ఎమ్మెల్సీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, మేయర్ వసీం, తదితరులు ఓటునభ్యర్థించారు. మండలి విప్, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో పట్టభద్రుల బ్యాలెట్‌లో 3వ సంఖ్యలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ బ్యాలెట్‌లో 11వ సంఖ్యలో ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిలకు ఒకటి నంబర్ రాసి, ఓటు వేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ అనుబంధ బీసీ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ జయలలిత పాల్గొన్నారు.

నకిలీల్లో టెన్షన్!

- ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన ఐదుగురిపై వేటు
- మరికొందరిపై లోతైన విచారణ
- అడ్డదారుల్లో ఉద్యోగాల్లో చేరిన వారిలో మొదలైన వణుకు



రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

రాయదుర్గం: రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో ఫేక్ సర్టిఫికెట్‌తో ప్లంబర్‌గా విధుల్లో చేరిన మహేష్‌ను జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇటీవల తొలగించారు. తాడిపత్రిలో కిరణ్ అనే ఉద్యోగితో పాటు గుంతకల్లు, శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, మడకశిరల్లోనూ మరో నలుగురు ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తేల్చారు. వారందరినీ కూడా ఇంటికి పంపించడంతో అక్రమార్కుల గుండెల్లో వణుకు మొదలైంది.

కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు

కరోనా సమయంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 2020-21లో కాంట్రాక్ట్ పద్ధతిన ఉమ్మడి జిల్లాలో 167కు పైగా ప్లంబర్స్, బయోమెడికల్ ఇంజినీర్లు, ఎలక్ట్రీషన్, జనరల్ డ్యూటీ అటెండర్, ఎంఎన్‌ఓ, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. అయితే ఎంపికైన వారిలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారని తేలడంతో ఇప్పటికే ప్లంబర్ సెక్షన్‌లో ఐదుగురిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించారు. అప్పట్లో ఉద్యోగాల్లో చేరిన వారందరి సరిఫికెట్లను అధికారులు మరోసారి తనిఖీ చేసేపనిలో ఉన్నట్లు సమాచారం.

సర్టిఫికెట్లు చూపని వారికి మెమో

అనంత జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న ఓ ఏరియా ఆస్పత్రిలో కరోనా సమయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధుల్లో చేరిన కొంతమంది సిబ్బందిపై విచారణ వేగవంతం చేశారు. అనుమానం ఉన్న వారిని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం తీసుకురావాలని కోరినా వివిధ కారణాలు చూపుతూ కొందరు దాటవేసే ధోరణి అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అలాంటి వారికి మెమోలు జారీచేసి వివరణకు ఆదేశించారు. మరో ఐదుగురిపై కూడా వేటు పడొచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

విచారణ చేయిస్తున్నాం



కరోనా సమయంలో టెక్నికల్ పోస్టులకు ఎంపికైన వారి కొందరు ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు గుర్తించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఐదుగురు ప్లంబర్లను విధుల నుంచి తొలగించాం. అనుమానం ఉన్న మిగతా వారిపై కూడా లోతైన దర్యాప్తు చేపట్టాం. నకిలీవని తేలితే ఎంతటి విధుల్లో నుంచి తొలగిస్తాం.
– ఎమ్ కృష్ణవేణి, డీసీహెచ్‌ఎస్, అనంతపురం

నేటి నుంచి సాఫ్ట్‌బాల్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయస్థాయి సీనియర్ జోనల్ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. స్థానిక అనంత క్రీడా గ్రామంలోని విన్సెంట్ క్రీడా మైదానంలో పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు సౌత్‌జోన్, నార్త్‌జోన్, వెస్ట్ జోన్, ఈస్ట్ జోన్ పురుషులు, మహిళల జట్లు తలపడనున్నాయి. శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, ఆర్టీటీ చైర్మన్ తిప్పేస్వామి, జాతీయ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ట్రెజరర్ శ్రీకాంత్ థోరట్, సీఈఓ ప్రవీణ్ అనోకర్, ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫణిభూషణ్, కార్యదర్శి నాగేంద్ర, సీఈఓ వెంకటేశులుతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు హాజరు కానున్నారు.

ఉద్యోగం పేరుతో టోకరా..

నల్లచెరువు: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి టి.విద్యాసాగర్ రెడ్డి తనను ఉద్యోగం పేరుతో మోసం చేశాడని నల్లచెరువు మండలం నడింపల్లికి చెందిన దామ ధనుంజయరెడ్డి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలమేరకు... తనకల్లు మండలం కోటూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విద్యాసాగర్‌రెడ్డి ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి తన వద్ద నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశారు. అయితే ఉద్యోగం ఇప్పించకుండా మొహం చాటేస్తున్నాడు. గట్టిగా అడిగితే డబ్బులు ఇవ్వనని నీకు దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరింపులకు దిగుతున్నాడు. ఇందులో భాగంగానే పోలీసులను ఆశ్రయించినట్లు బాధితుడు దామ ధనుంజయరెడ్డి తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ వరలక్ష్మిని వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'చంద్రబాబు నమ్మక ద్రోహి'

అనందపురం టవర్‌క్లాక్: ఒట్టి అబద్ధాలు చెబుతూ అధికార దుర్వినియోగం చేసిన నమ్మక ద్రోహి చంద్రబాబు అని బీఈడీ, పీఇటీ అభ్యర్థుల అసోసియేషన్ అధ్యక్షుడు హనుమన్న విమర్శించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బీఈడీ, పీఇటీ అభ్యర్థుల అసోసియేషన్ ఆధ్వర్యంతో విలేకరుల సమావేశం నిర్వహించారు. హనుమన్న మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశా రు. టీడీపీ ప్రభుత్వ హయాంలో హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టిన చంద్రబాబు మళ్లీ నమ్మి మోసపోకూడదన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని విస్మరించిన బాబును, ఆయనకు వత్తాసు పలుకుతున్న బీజేపీ, జనసేన, వామపక్ష నాయకులు ఓటర్లను ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నరసింహులు, నూర్‌మహ్మద్, కృష్ణప్ప, శివకుమార్, బాలాజీనాయక్, శివ, పాల్గొన్నారు.

ఘనంగా శయనోత్సవం



అలంకరణలో శివలక్ష్మీ చెన్నకేశవస్వామి

యాడికి: శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి శయనోత్సవంతో ముగిశాయి. శుక్రవారం అర్చకులు హరికృష్ణ శర్మ శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శయనోత్సవం నిర్వహించారు. చివరి రోజు ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

చికిత్స పొందుతూ పీహెచ్‌డీ విద్యార్థి మృతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మేథమేటిక్స్ విభాగంలో పరిశోధన చేస్తున్న గుజ్జల ఆంజనేయులు అనే విద్యార్థి శుక్రవారం మృతి చెందారు. ఇటుకలపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు.. గుజ్జల ఆంజనేయులు అనే పరిశోధన విద్యార్థి గత శనివారం కృష్ణా హాస్టల్ మేడ పైన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అయితే శుక్రవారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆంజనేయులు తల్లిదండ్రులు సుబ్బమ్మ, లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరు కుమారుల్లో ఆంజనేయులు చిన్న కొడుకు. రామగిరి మండలం శేషంపల్లికి చెందిన గుజ్జల ఆంజనేయులు ఏపీ రీసెట్-2022లో 31వ ర్యాంకు దక్కించుకుని పీహెచ్‌డీ అడ్మిషన్ పొందారు. డిగ్రీ లెక్చరర్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. డిగ్రీ లెక్చరర్ పోస్టు దక్కకపోవడంతో మానసికంగా కృంగిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవలే పీహెచ్‌డీ అడ్మిషన్ చేసుకోవడంతో ఫ్రీ పీహెచ్‌డీ పరీక్షకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే అధికారులు అనుమతించలేదు. మెస్ బిల్లు రూ.14 వేలు ఉండడంతో చెల్లించడానికి డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పలు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దపప్పూరు: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తిచెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపప్పూరు మండలం రామకోటికాలనీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు .. రామాంజనేయులు (54) , ఆయన భార్య సరస్వతి పెద్దపప్పూరు మండలం రామకోటి కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలోనే మన స్థాపానికి గురైన రామాంజనేయులు రామకోటి సమీపంలోని ఓ సపోట తోటలో శుక్రవారం తెల్లవారుజామున ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాధితుల పిర్యాదు మేరకు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నీటి తొట్టెలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

బుక్కరాయసముద్రం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని చేపల కాలనీలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా తనిఖీ నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతో పాటు ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో ఉండే నీటి తొట్టెలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తేజోత్స్న అధ్యక్షతన నిర్వహించిన జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఎంఈఓ గురుప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సెంట్రల్ లెవల్ క్విజ్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలోని ఆడిటోరియంలో శనివారం సెంట్రల్ లెవల్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్ మురళి తెలిపారు. కార్యక్రమానికి డీఈఓ సాయిరాం ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


కనగానపల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ శంకర్‌లాల్, తదితరులు

కనగానపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఈ శంకర్‌లాల్ హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రం లోని జగనన్న కాలనీని ఆయన సందర్శించి, ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కనగానపల్లిలోని హౌసింగ్ కాలనీలో ప్రస్తుతం 50 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వీటిని త్వరగా పూర్తిగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీధర్, హౌసింగ్ ఏఈ చిరంజీవి, డైరెక్టర్ ప్రభాకర్, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

'మినర్వా'లో సరస్వతి పూజ


పూజలోపాల్గొన్న కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి

రాప్తాడురూరల్: నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న మినర్వా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శుక్రవారం సరస్వతీ పూజ ఏర్పాటు చేశారు. పదో తరగతి చదువుతున్న బాల బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి, పూజలో పాల్గొన్నారు. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థీ ఉత్తమ శ్రేణితో విజయం సాధించాలని కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18న ఉగాది విశిష్టతపై పోటీలు

అనంతపురం కల్చరల్: తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 18న పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. భాషా సంస్కృతి పరిరక్షణలో భాగంగా స్థానిక కేఎస్‌ఆర్ బాలికల పాఠశాలలో ఉదయం 9.30 నుంచి 'పండుగల పరమార్థం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ఉగాది పండుగ విశిష్టత అనే అంశంపై వక్తృత్వపు, జానపద గేయం, చిత్రలేఖనం, పద్య పఠనం తదితర అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. 6,7 తరగతులకు, 8,9,10 తరగతులకు వేర్వేరుగా పోటీలుంటాయన్నారు. 5వ తరగతి లోపు విద్యార్థులకు బాల గేయాల పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు సెల్ : 9440488444 లో సంప్రదించాలన్నారు.

ఆస్పత్రికి కుర్చీల వితరణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: సర్వజనాస్పత్రిలోని జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ విభాగాలకు ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ రూ.80 వేల విలువజేసే కుర్చీలు వితరణ చేశారు. శుక్రవారం స్థానిక సర్వజనాస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ఈఎన్‌టీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ నవీద్, జనరల్ మెడిసిన్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భీమ్‌సేనాచారికి అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రావు, డాక్టర్ మహేష్, ఆడియాలజిస్ట్ వన్నూరుస్వామి, సిబ్బంది దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

ఆత్మకూరు: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులు నివారించవచ్చని వైద్యాధికారులు సుబీయా సుల్తానా, దయాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఈ నెల 14న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. మండలా వ్యాప్తంగా 7,589 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ చిన్నారులు ఉన్నారన్నారు. మిగిలిన వారికి ఈనెల 18న ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయేంద్ర ప్రసాద్, ఎంఈఓ నరసింహ రెడ్డి, సీహెచ్‌ఓ చంద్రావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాగిపిండి, బెల్లం సరఫరా

శింగనమల: వేసవిలో విద్యార్థులకు రాగిమాల్ట్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్‌కు వచ్చిన రాగిపిండి, బెల్లం ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు. స్టాక్ పాయింట్ నుంచి శింగనమల, నార్పల మండలాల్లోని 97 చౌకదుకాణాలను బెల్లం, రాగిపిండి సరఫరా చేశారు. డీలర్లు వాటిని ప్రభుత్వ పాఠశాలలకు చేరవేస్తారని సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం


25వ డివిజన్‌లో ఓటు అభ్యర్థిస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరిత


దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులును ఓటు అభ్యర్థిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభివృద్ధికి ఓటు వేయాలని, వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఓటర్లను కోరారు. శుక్రవారం నగరంలోని 25వ డివిజన్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరితతో కలసి ఆయన ఎమ్మెల్సీ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. దేశ చరిత్రలో ఏ సీఎం చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. వైద్య రంగంలోనూ నాడు–నేడు కార్యక్రమాల ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చి, పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి రానున్నాయని, అందుకు సంబంధించి వివిధ పరిశ్రమలు ఎంఓయులు చేసుకున్న విషయాన్ని తెలియజేశారు. మేధావులు, విద్యావంతులు మరోసారి ఆలోచించి, వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, రమణారెడ్డి, శివారెడ్డి, బోయ సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని దిశ, త్రీటౌన్ పోలీసు స్టేషన్లు, ఎంఆర్‌ఓ కార్యాలయం ఆవరణంలో మేయర్ వసీం ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థులు ఓటు వేయాలని దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, తదితర అధికారులకు మేయర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, నాయకులు ఖాజా, తదితరులు పాల్గొన్నారు.
- ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి ఓటు వేయాలని నాయీబ్రాహ్మణ కులానికి చెందిన ఉద్యోగులకు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఎం. నరసింహులు, రామకృష్ణ, శ్రీను, రామాంజనేయులు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


షటిల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల 2022 బ్యాచ్ మెడికల్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఆటల, పాటల, వక్తృత్వపు పోటీలుకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడి ఆమె శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్యులు శ్యాంప్రసాద్, భవాని, దివ్య, శ్రీనివాసరావు, విజయరాఘవేంద్ర, దుర్గ షహజీర్, పునర్జీవన్‌కుమార్, పీడీ నరసింహనాయక్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతికి అధికారులే కారణం

- వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కేశవరెడ్డి

అనంతపురం అర్బన్: ఉపాధిహామీ పథకంలో అవినీతికి డ్వామా అధికారులే ప్రధాన కారణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం సంఘం కార్యాలయంలో ఉపాధ్యక్షులు నాగరాజు, పెద్దయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చాలా మందికి పనులు కల్పించామని అధికారులు లెక్కలు చెప్తున్నారన్నారు. ఆచరణలో మాత్రం భిన్నమైన పరిస్థితి ఉందన్నారు. క్షేత్రస్థాయి ఎఫ్‌ఏలు, టీఏలు బోగస్ మస్టర్లు తయారు చేసి, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నార్పల మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ బోగస్ మస్టరు వేస్తూ పనిచేయని కూలీలతో డబ్బులు డ్రా చేసుకున్నాడని చెపారు. ఇలా దాదాపు రూ.10 లక్షలు అవినీతికి పాల్పడ్డాడని చెప్పారు. విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్తే అతన్ని సస్పెండ్ చేశారన్నారు. అయితే ఇప్పటికీ డబ్బులు రికవరీ చేయలేదన్నాడు. శింగనమల మండలం సలకం చెరువులో ఎఫ్‌ఏ, టీఏ ఇద్దరూ ఆరు గ్రూపులకు బోగస్ మస్టర్లు వేసి, కూలీల ఖాతాల్లో డబ్బులు డ్రా చేసుకున్నారన్నారు. ఇదే గ్రామంలో డ్రైలాండ్ హార్టికల్చర్ పేరుతో రూ.లక్షలు అవినీతి చేశారన్నారు. ఓపెన్ ఫోరంలో అడిగితే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారే కానీ చర్యలు మాత్రం చేపట్టలేదన్నారు. కళ్యాణదుర్గం, కుందుర్పి, శెట్టూరు, కూడేరు, ఉరవకొండ, కణేకల్లు తదితర మండలాల్లో జరిగిన ఓపెన్ ఫోరంలో పెద్ద ఎత్తున్న అవినీతి జరిగినట్లు తెలిసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదన్నారు.

యూసీఎస్ బకాయిలు చెల్లించాలి


ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల బకాయి పడిన (యూసీఎస్–యూనివర్సిటీ కామన్‌సర్వీసెస్) ఫీజులు చెల్లించాలని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనంలో అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లతో ఆన్‌లైన్‌లో శుక్రవారం మాట్లాడారు. యూసీఎస్ బకాయిలు చెల్లించని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ కోర్సులకు అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతి కళాశాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించాలన్నారు. ఇంటర్న్‌షిప్‌లు పూర్తి చేయడానికి తగిన సహకారం అందించాలని కోరారు. వర్సిటీ అధికారులు ఏదైనా సమాచారం కావాలని కోరితే త్వరితగతిన ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ , డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత, డీఏఏ ప్రొఫెసర్ ఏ సురేష్ బాబు, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు యంత్ర పరికరాలు


బోగినేపల్లిలో యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకటరాముడు

రాప్తాడు: మండలంలో అర్హులైన ప్రతి రైతుకూ యంత్ర పరికరాలు పంపిణీ చేస్తామని ఏడీఏ వెంకటరాముడు పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూప్ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసి యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఏడీఏ వెంకటరాముడు మాట్లాడుతూ పరికరాల వినియోగం, రాయితీలపై రైతులకు వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో పంట సాగు విధానాలు, దిగుబడి, ఉత్పత్తి తదితర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. వేరుశనగ పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, సున్నావడ్డీ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో రామ్‌నగర్ ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ అనిత, ఏఓ శుభకర్, ఆర్‌బీకే అధికారిణి సంధ్య, సీహెచ్‌సీ గ్రూప్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అద్దెకున్న వారు చెల్లించాలి

అనంతపురం క్రైం: ఏళ్ల తరబడి ఇంటి, నీటి, ఇతర పన్ను యజమానులు చెల్లించని పక్షంలో అద్దెకున్న వారు చెల్లించాల్సిందేనని, అందుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు అదనపు కమిషనర్ రమణారెడ్డి మొండిబకాయిదారులను హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని రాజురోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని కమర్షియల్ కాంప్లెక్స్ యజమానుల ఇళ్లకు అదనపు కమిషనర్ రమణారెడ్డి వెళ్లారు. కమర్షియల్ ట్రేడర్స్, తదితరుల నుంచి రూ.17 లక్షల వరకు పన్ను బకాయి వసూలైంది. శనివారం కూడా పన్ను చెల్లించే అవకాశాన్ని కల్పించినట్లు అదనపు కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థలోని పలు కౌంటర్లు, పాతూరులోని 17వ సచివాలయం, రాంనగర్‌లోని 54వ వార్డు సచివాలయం, రెండోరోడ్డులోని 64వ సచివాలయంలో పన్ను చెల్లించే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. అంతకుముందు శుక్రవారం 6, 10, 13, 15, 17, 19 రెవెన్యూ వార్డుల్లోని సచివాలయ సిబ్బందితో అదనపు కమిషనర్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు వేణు, మురళీ, బాబు, పద్మావతి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

రామగిరి: మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌ను తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఆజాద్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ముత్యాలమ్మతల్లికి పూజలు

రామగిరి: సనసకోట ముత్యాలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేగాక, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

మందు పిచికారీపై అవగాహన

బుక్కరాయసముద్రం: మందుల పిచికారీకి డ్రోన్ ఉపయోగకరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మవరం మండలం ఉప్పనేసినపల్లిలో రెడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎంటీ డైరెక్టర్ కమల, రైతులు పాల్గొన్నారు.

కర్నూలుకు క్షతగాత్రుడి తరలింపు

రాప్తాడురూరల్: కురుగుంట సమీపంలోని ఇంటెల్ కళాశాల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కుళ్లాయిస్వామిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కురుగుంటలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పీడీగా పని చేస్తున్న శైలజ (50) ఘటనా స్థలంలో అక్కడికక్కడే మృతిచెందిన విషయం విదితమే. నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వెళ్లిన శైలజ..తిరుగు ప్రయాణంలో పాత విద్యార్థి కుళ్లాయిస్వామితో కలిసి బైకుపై బయల్దేరారు. ఇంటెల్ కళాశాల వద్ద డివైడర్లు మూసిన తర్వాత రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఆపి ఉన్న బండలలారీని గుర్తించక వెనుకవైపు నుంచి బలంగా ఢీ కొట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లిన కుళ్లాయిస్వామి శుక్రవారం రాత్రి దాకా స్పృహలోకి రాలేదని బంధువులు తెలిపారు. విషాదంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది : రాత్రి 10 గంటల సమయంలో కళాశాల నైట్‌వాచ్‌ఉమెన్‌కు ఫోన్ చేసిన శైలజ గంటలోపు కళాశాలకు వస్తానని చెప్పింది. అదే గంట సమయానికి పోలీసుల నుంచి ఫోన్ వచ్చి పీడీ రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయిందని చెప్పడంతో కళాశాల విద్యార్థులు, సిబ్బంది తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

అక్షరాస్యతతోనే మహిళాభివృద్ధి


కొత్తపల్లిలో ర్యాలీ చేస్తున్న మహిళలు

రాప్తాడు: అక్షరాస్యతతోనే మహిళాభివృద్ధి సాధ్యమని ఆర్డీటీ సీడీసీ అధ్యక్షురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జి.కొత్తపల్లిలో అంతార్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ముందుగా మహిళా సంఘాల లీడర్లతో ర్యాలీ చేశారు. ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది సిద్దమ్మ, ప్రణవి, నాగేంద్రమ్మ, జ్యోతి, గాయిత్రి, పుల్లమ్మ, నాగలక్ష్మి, లక్ష్మిదేవి, సుజాత, లత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

రాప్తాడురూరల్: డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. కంబదూరు మండలం గొల్లపల్లికి చెందిన కురుబ తేజశ్విణి నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటుంది. ప్రస్తుతం సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం కక్కలపల్లి సమీపంలోని వాణి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి వెళ్లిన తేజశ్విణి.. తిరిగి హాస్టల్‌కు చేరుకోలేదు. అనుమానం వచ్చిన ప్రిన్సిపాల్ .. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థిని మేనమామ పాత లింగప్ప శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ విద్యార్థిని తన బంధువైన వ్యక్తితో వెళ్లినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సావిత్రీబాయి ఆశయ సాధనకు కృషి


సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా సమాఖ్య నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పార్వతమ్మ కాలనీలో సావిత్రిబాయి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకురాళ్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షురాలు కమ్మక్క, నాయకురాళ్లు యశోదమ్మ, రమాదేవి, నాగమ్మ, సుశీలమ్మ, నూర్జహాన్, పుల్లమ్మ, నాగమ్మ, షకీల పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిద్దాం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిద్దామని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన క్యాజువాలిటీ, ఏఎంసీ, రేడియాలజీ విభాగాలను పరిశీలించారు. ప్రధానంగా వెంటిలేటర్ల బెడ్లు ఏర్పాటు చేసేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ రజిత, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 రజని తదితరులు పాల్గొన్నారు.


క్యాజువాలిటీని తనిఖీ చేస్తున్న సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

అనంతపురం క్రైం: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా, సకాలంలో అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులను జాప్యం చేయడం సరికాదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కమిషనర్ కే భాగ్యలక్ష్మి అకౌంట్స్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో ఎగ్జామినర్, ఏఓలకు కమిషనర్ భాగ్యలక్ష్మి వేర్వేరుగా క్లాస్ పీకారు. సమావేశంలో ఎగ్జామినర్ ఎస్. వెంకటరమణ, ఏఓ పద్మావతి, సూపరింటెండెంట్ విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలి

కనగానపల్లి: ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనుల వివరాలు, ఖర్చును రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయించాలని డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. మండలంలో 2021– 22లో చేపట్టిన ఉపాధిపనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. ధర్మవరంలోని ఏపీడీ క్లస్టర్ కార్యాలయంవద్ద ప్రజావేదిక నిర్వహించారు. డీసీ రమణారెడ్డి, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ సుధాకర్ పాల్గొన్నారు.


కేఎస్‌ఆర్ బాలికల హైస్కూల్‌లో భోజనానికి క్యూలో నిలబడిన విద్యార్థినులు


షెడ్డు కింద భోజనం చేస్తున్న విద్యార్థినులు


అన్నం వడ్డిస్తున్న నిర్వాహకురాలు

ఫుడ్డు..వెరీ గుడ్డు!

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు చదువుతోపాటు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. 'జగనన్న గోరుముద్ద' పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మెనూ అమలు చేసి, నాణ్యమైన భోజనం అందిస్తుండడంతో విద్యార్థుల హాజరుశాతం కూడా పెరిగింది. నగరంలోని కేఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులు మొత్తం 1,147 మంది ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పప్పు అన్నం, గుడ్లు, చిక్కీలు అందించారు. భోజనం నాణ్యతగా ఉందని విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


విద్యార్థినులకోసం ఉంచిన గుడ్లు, చిక్కీ

సాక్షి బిజినెస్
శనివారం
11-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
671	177
59,135	17,413

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,233	▽ 105
డోజోన్స్	32,093	▽ 161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,748	▽ 132
డాక్స్	15,428	▽ 205
షాంఘై	3,230	▽ 46
నికాయ్	28,144	▽ 479

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	55,669 △	383
బంగారం (22 క్యారట్)	55,446 △	381
వెండి (కిలో)	61,791 ▽	2

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.38	83.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	96.38	99.64
€	యూరో	ఎస్‌బీఐ	85.60	88.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.23	61.15
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.93	55.28
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.68	61.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.44	23.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.69	12.76

హెచ్‌యూఎల్ ఎండీగా రోహిత్ జావా



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నూతన ఎండీ, సీఈవోగా రోహిత్ జావా నియమితులయ్యారు. దశాబ్ద కాలంపాటు నాయకత్వం వహించి పదవీ విరమణ చెందుతున్న సంజీవ్ మెహతా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం లండన్‌లో యూనిలీవర్ ట్రాన్స్‌ఫర్మేషన్ చీఫ్‌గా జావా ఉన్నారు. అయిదేళ్ల కాలానికిగాను ఎండీ, సీఈవోగా 2023 జూన్ 27న బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 1న కంపెనీ శాశ్వత డైరెక్టర్‌గా హెచ్‌యూఎల్ బోర్డులో చేరనున్నారు. యూనిలీవర్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్‌గానూ ఆశీనులు కానున్నారు.

సెమీకండక్టర్ల రంగంలో మరింత సహకారం

భారత్, అమెరికా మధ్య ఎంవోయూ



సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్ అమెరికా వాణిజ్య మంత్రులు

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా భారత్, అమెరికా శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత్–అమెరికా వాణిజ్య చర్చల్లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందం.. సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థ ఏర్పాటు, ఆవిష్కరణల అంశాల్లో కలిసి పనిచేసేందుకు తోడ్పడనుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమొండో చర్చించారు. ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదగాలన్న భారత్ ఆకాంక్షలకు ఈ ఎంవోయూ ద్వారా తోడ్పాటు లభించగలదని అమెరికా భావిస్తున్నట్లు రైమొండో తెలిపారు. పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని గోయల్ వివరించారు.

పారిశ్రామిక ఉత్పత్తి ఓకే!

- జనవరిలో ఐఐపీ 5.2 శాతం అప్
- విద్యుత్, తయారీలు బాగున్నాయ్



న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి 2023 జనవరిలో మంచి పనితీరును కనబరిచింది. ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) 5.2 శాతం పెరిగింది. 2022 డిసెంబర్‌లో సూచీ పెరుగుదల రేటు 4.7 శాతంగా ఉంది. ఇక 2022 జనవరిలో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 2 శాతం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం విద్యుత్, తయారీ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.

రంగాల వారీగా ఉత్పత్తి గణాంకాలు (శాతాల్లో)

	2023 జనవరి	2022 డిసెంబర్
తయారీ	3.7	2.6
మైనింగ్	8.8	9.8
విద్యుత్	12.7	10.4
క్యాపిటల్ గూడ్స్	11.0	7.6
కన్జూమర్ డ్యూరబుల్స్	- 7.5	- 10.4
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	6.2	7.2
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.1	8.2
ప్రైమరీ గూడ్స్	- 9.6	8.3
ఇంటర్మీడియట్ గూడ్స్	-0.1	-0.3

ఏప్రిల్ నుంచి జనవరి వరకూ ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 5.4 శాతంకాగా, 2021-22 ఇదే కాలంలో ఈ రేటు 13.7 శాతం.

అంబుజాలో అదానీ 4.5 శాతం వాటాల విక్రయం



న్యూఢిల్లీ: అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోవడంపై అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ దృష్టి పెడుతున్నారు. ఇందులో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని విలువ సుమారు 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,380) ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఆర్థిక సంస్థలను కూడా సంప్రదించినట్లు పేర్కొన్నాయి. గతేడాది కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్‌లో అదానీకి 63 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్ రుణ భారం దాదాపు 24 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో గ్రూప్ కంపెనీల షేర్లు ఇటీవల భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ కొన్ని క్రమంగా కోలుకుంటున్నాయి.

ఐపీవోకు టాటా టెక్నాలజీస్



దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. గ్లోబల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అందించే టాటా టెక్నాలజీస్ ఐపీవో సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌కు ఇది అనుబంధ సంస్థకాగా.. ఇంతక్రితం ఐటీ సేవల నంబర్ వన్ కంపెనీ టీసీఎస్ 2004లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఐపీవోలో భాగంగా టాటా టెక్నాలజీస్ 9.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది.

గ్లోబల్ సర్ఫేసెస్ @ రూ. 133-140

నేచురల్ స్టోన్స్ ప్రాసెసింగ్, ఇంజనీర్డ్ క్వార్ట్జ్ తయారీ కంపెనీ గ్లోబల్ సర్ఫేసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సోమవారం(13న) ప్రారంభం కానుంది. బుధవారం (15న) ముగియనున్న ఇష్యూకి షేరుకి రూ. 133–140 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 155 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా 85.2 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.

మార్కెట్లకు గ్లోబల్ షాక్



- రెండో రోజూ భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్
- 59,135 వద్ద ముగింపు
- 177 నష్టంతో 17,413కు నిఫ్టీ

ముంబై: యూఎస్‌కు చెందిన ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ నిధుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంటుకు దెబ్బ తగిలింది. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు కోల్పోయి 59,135 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177 పాయింట్లు క్షీణించి 17,413 వద్ద నిలిచింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,885ను తాకింది. ఒక్క రోజులోనే బీఎస్ఈ మార్కెట్ విలువలో రూ. 1.36 లక్షల కోట్లు ఆవిరైంది. రూ. 2,62,94,724 కోట్లకు చేరింది.

బ్యాంకింగ్‌కు దెబ్బ

అంచనాలకు మించి వడ్డీ రేట్లు పెరగవచ్చన్న యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ వ్యాఖ్యలు, ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్‌పై ఆందోళనలు ఇన్వెస్టర్లలో భయాలకు కారణమయ్యాయి. దీంతో దేశీయంగా బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎన్ఎస్ఈలో బ్యాంకింగ్, మీడియా, రియల్టీ, మెటల్, ఐటీ 2–1 శాతం నీరసించాయి. ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యురబుల్స్ స్వల్పంగా బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, అపోలో హాస్పిటల్స్, ఇండస్‌ఇండ్, ఎస్‌బీఐ, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ, ఎల్అండ్‌టీఆర్ఐఎల్, కొటక్ బ్యాంక్ 3–1 శాతం మధ్య క్షీణించాయి. టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మారుతీ, బ్రిటానియా, పవర్‌గ్రిడ్, టైటన్ 1–0.4 శాతం మధ్య బలపడ్డాయి.

మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్

న్యూయార్క్: ఇన్సూర్డ్ డిపాజిట్ల రక్షణకు వీలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ని మూసివేసినట్లు కాలిఫోర్నియా ఆర్థిక పరిరక్షణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఫైనాన్షియల్ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఐసీ చేతికి అప్పగించినట్లు శుక్రవారం వెల్లడించింది. ప్రధానంగా సిలికాన్ వ్యాలీ, టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్ ఆర్థిక సంక్షోభంలో పడింది. బ్యాంక్ పోర్ట్‌ఫోలియోలో భారీ నష్టాలు నమోదుకావడంతో నిధుల సమీకరణకు తెరతీసింది. బాండ్ల పోర్ట్‌ఫోలియోలో నష్టాలు నమోదు చేస్తున్న 21 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,72,000 కోట్లు) విలువైన బాండ్లను విక్రయించినట్లు ఎస్‌వీబీ వెల్లడించింది. దీంతో 1.8 బిలియన్ డాలర్ల చిల్లు పడినట్లు తెలియజేసింది. ఫలితంగా బ్యాలన్స్‌షీట్ పటిష్టత కోసం 2.25 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో నికర వడ్డీ ఆదాయం భారీగా క్షీణించవచ్చని బ్యాంక్ అంచనా వేసింది. యూఎస్ వెంచర్ క్యాపిటల్(వీసీ) దన్నున్న మొత్తం స్టార్టప్‌లలో సగానికిపైగా ఎస్‌వీబీ ఫైనాన్షియల్ సేవలందిస్తోంది. కస్టమర్లలో గతేడాది ఐపీవోకు వెళ్లిన 44 శాతం టెక్, హెల్త్‌కేర్ కంపెనీలుండటం గమనార్హం! జాబితాలో పింటెరెస్ట్ ఇంక్, షాపిఫై ఇంక్, సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ హోల్డింగ్స్ తదితరాలున్నాయి. వెరసి పలు వీసీ సంస్థలు ఎస్‌వీబీతో పోర్ట్‌ఫోలియో బిజినెస్‌లను తగ్గించుకోవడంతోపాటు నగదును వెనక్కి తీసుకునే యోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంక్‌పట్ల విశ్వాసం ఉంచవలసిందిగా క్లయింట్లు, వీసీ ఇన్వెస్టర్లను ఎస్‌వీబీ సీఈవో గ్రెగ్ బెకర్ అభ్యర్థించారు.

బ్యాంక్ షేర్లకు సెగ

ఎస్‌వీబీ ఆర్థిక సంక్షోభ ఆందోళనలకుతోడు సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ మూతపడటంతో ఇన్వెస్టర్లలో భయాలు అధికమయ్యాయి. ఇటీవలే ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వడం దీనికి జత కలిసింది. ఫలితంగా గురువారం కేబీడబ్ల్యూ బ్యాంక్ ఇండెక్స్ 8% కుప్పకూలింది. యూఎస్ దిగ్గజాలు బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, జేపీ మోర్గాన్ షేర్లు 5%స్థాయిలో పతనమయ్యాయి.

కనెక్ట్ స్మార్ట్ సన్‌గ్లాసెస్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ కనెక్ట్ గ్యాడ్జెట్స్ రిథమ్ పేరుతో బ్లూటూత్ కాలింగ్ స్మార్ట్ సన్‌గ్లాసెస్‌ను ఆవిష్కరించింది. ఎండ నుంచి రక్షణతోపాటు ఫోన్ కాల్స్ అందుకోవచ్చు. పాటలు వినొచ్చు. స్పెషల్ లాంచ్ ఆఫర్ ధర రూ. 1,999. నాలుగు గంటల ప్లేబ్యాక్ టైమ్ అందిస్తుంది. మార్కెట్లోకి విడుదల చేసిన 3 రోజుల్లోనే 20,000 యూనిట్లు విక్రయించామని కంపెనీ కో-ఫౌండర్ ప్రదీప్ యెర్రగుంట్ల తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-3-2023	
విశాఖ	430–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423–00
విజయవాడ	423–00
రిటైల్ ధర (డజను)	66.00
10-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

సాక్షి స్పోర్ట్స్

జర్మనీపై భారత్ విజయం



ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో కీలక గెలుపు చేరింది. రూర్కెలాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో ప్రపంచ చాంపియన్ జర్మనీపై సంచలన విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ నిమిషం) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ రెండు ఫీల్డ్ గోల్స్ (31వ ని., 42వ ని.) నమోదు చేశాడు. జర్మనీ నుంచి రెండూ ఫీల్డ్ గోల్స్ వచ్చాయి. 44వ నిమిషంలో కాఫ్‌మన్ పాల్ ఫిలిప్, 57వ నిమిషంలో స్ట్రతఆఫ్ మైకేల్ గోల్స్ కొట్టారు. మూడో క్వార్టర్ ముగిసే సరికి భారత్ 3–1తో ఆధిక్యంలో నిలిచినా... చివరి క్వార్టర్‌లో జర్మనీ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీని భారత్ సద్వినియోగం చేసుకోగలిగింది. భారత్ తమ తర్వాతి పోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుంది.

మన బ్యాటర్లపైనే భారం



అశ్విన్

భారత్, ఆస్ట్రేలియా ఆఖరి టెస్టు పరుగుల బాట పట్టింది. గ్రీన్ శతకం సహాయంతో కంగారూలు భారీ స్కోరు నమోదు చేశారు. ఒక ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఈ సిరీస్‌లో ఇదే మొదటిసారి. ఇక మన జట్టు ఎన్ని పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఆడిన పది ఓవర్లలో చక్కటి షాట్లతో ఎలాంటి ప్రమాదం లేకుండా రెండో రోజును ముగించిన టీమిండియా... మూడో రోజూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చెలరేగాల్సి ఉంది.

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 36/0
- ఆస్ట్రేలియా 480 ఆలౌట్
- కామెరాన్ గ్రీన్ సెంచరీ

అహ్మదాబాద్: ఈ సిరీస్‌లో స్పిన్ మాయలో, వికెట్ల వేటలో విజయవంతమైన బౌలర్లకు చివరి టెస్టు కఠినమైన సవాల్ విసురుతోంది. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించిన మోదీ మైదానంలో రెండో రోజూ పరుగుల జోరు కొనసాగింది. అశ్విన్ (6/91) ఆరు వికెట్లతో ఆకట్టుకోగా... అప్పటికే పర్యాటక ఆసీస్ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (422 బంతుల్లో 180; 21 ఫోర్లు) డబుల్ సెంచరీ అవకాశం కోల్పోగా, కామెరాన్ గ్రీన్ (170 బంతుల్లో 114; 18 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి శతకం బాదాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ పది ఓవర్లు ఆడి వికెట్ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (17 బ్యాటింగ్; 2 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

ద్విశతక భాగస్వామ్యం...

రెండో రోజు తొలి సెషన్‌లో కూడా ఆస్ట్రేలియా ఆధిపత్యమే కొనసాగింది. 255/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఉస్మాన్ ఖాజా– గ్రీన్ జోడీ భారత బౌలింగ్‌పై పైచేయి సాధించింది. దీంతో జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. లంచ్ బ్రేక్‌కు ముందే ఖాజా 150 మార్క్‌ను దాటగా, గ్రీన్ సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచాడు. 347/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగియగా, రెండో సెషన్ మొదలైన కాసేపటికే గ్రీన్ టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. ఐదో వికెట్‌కు ఉస్మాన్ ఖాజా, గ్రీన్ 208 పరుగులు జోడించారు. 1979 తర్వాత భారత్ గడ్డపై ఆస్ట్రేలియా జోడీ నమోదు చేసిన ద్విశతక భాగస్వామ్యం ఇదే! ఆతిథ్య జట్టును అష్టకష్టాలు పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్ విడగొట్టాడు. గ్రీన్‌ను అవుట్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యారీ (0)ని కూడా పెవిలియన్ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో స్టార్క్ (6)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఈ పర్యటనలో తొలిసారి 400 పరుగుల మైలురాయిని చేరుకోగా, 409/7 వద్ద టి విరామానికి వెళ్లారు.

విసిగించిన మర్ఫీ, లయన్

ఆఖరి సెషన్లో డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న ఖాజాకు అక్షర్ పటేల్ చెక్ పెట్టాడు. ఇంకేం మిగతా రెండు వికెట్లను కూల్చేయడం సులభమే అనుకున్న భారత్‌కు టెయిలెండర్లు టాడ్ మర్ఫీ (61 బంతుల్లో 41; 5 ఫోర్లు), లయన్ (96 బంతుల్లో 34; 6 ఫోర్లు) చెమటలు పట్టించారు. ఇద్దరు 19.2 ఓవర్లు ఆడటంతో ఆతిథ్య బౌలర్లు శ్రమించక తప్పలేదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చిన పిచ్‌పై ఈ స్పెషలిస్టు బౌలర్లు చక్కగా బ్యాటింగ్ చేశారు. వీలుచిక్కిన బంతిని బౌండరీలకు తరలించారు. ఇక ఒక దశలో 500 పరుగులు దాటిస్తారనిపించింది. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. అయితే అశ్విన్ వరుస ఓవర్లలో మర్ఫీ, లయన్‌ను అవుట్ చేయడంతో ఆసీస్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఖాజా (ఎల్బీ) (బి) అక్షర్ 180; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ (సి) భరత్ (బి) అశ్విన్ 114; క్యారీ (సి) అక్షర్ (బి) అశ్విన్ 0; స్టార్క్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 6; లయన్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 34; మర్ఫీ (ఎల్బీ) (బి) అశ్విన్ 41; కునెమన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (167.2 ఓవర్లలో ఆలౌట్) 480. **వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170, 5-378, 6-378, 7-387, 8-409, 9-479, 10-480. **బౌలింగ్:** షమీ 31-3-134-2, ఉమేశ్ 25-2-105-0, అశ్విన్ 47.2-15-91-6, జడేజా 35-5-89-1, అక్షర్ 28-8-47-1, అయ్యర్ 1-0-2-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ బ్యాటింగ్ 17; గిల్ బ్యాటింగ్ 18; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 36. **బౌలింగ్:** స్టార్క్ 3-1-7-0, గ్రీన్ 2-0-11-0, లయన్ 3-0-14-0, కునెమన్ 2-0-3-0.



గ్రీన్

611 ఖాజా బ్యాటింగ్ చేసిన నిమిషాలు. భారత్‌లో ఒక ఆసీస్ బ్యాటర్ సుదీర్ఘ ఇన్నింగ్స్ ఇదే. ఆసీస్ తరఫున బంతులపరంగా (422) కూడా ఖాజాదే రికార్డు. గతంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (యూనిస్‌ఖాన్, ఆమ్లా, జయవర్ధనే) మాత్రమే భారత్‌లో 10 గంటలకు పైగా బ్యాటింగ్ చేయగలిగారు.

32 ఇన్నింగ్స్‌లో అశ్విన్ 5 వికెట్లు పడగొట్టడం ఇది 32వ సారి. భారత గడ్డపై కుంబ్లే (25 సార్లు) పేరిట ఉన్న రికార్డును అతను (26) అధిగమించాడు. ఆసీస్‌పై అత్యధిక వికెట్లు (113) తీసిన భారత బౌలర్‌గా కూడా కుంబ్లే (111) రికార్డును అశ్విన్ సవరించాడు.

కమిన్స్ ఇంట్లో విషాదం

సిడ్నీ: ఆస్ట్రేలియా టీమ్ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తల్లి మారియా కన్నుమూసింది. చాలా ఏళ్లుగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అయితే రెండు వారాల క్రితం మారియా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దాంతో తల్లిని చూసుకునేందుకు కమిన్స్ భారత్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వెళ్లాడు. ఆమె కోలుకోకపోవడంతో అక్కడే ఉండిపోయాడు. మారియా మృతి పట్ల ఇరు దేశాల క్రికెట్ బోర్డులు సంతాపం ప్రకటించగా...ఆస్ట్రేలియా క్రికెటర్లు సంతాపసూచకంగా శుక్రవారం భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి మైదానంలోకి దిగారు.

బెంగళూరుకు నాలుగో ఓటమి

- 10 వికెట్లతో యూపీ జయభేరి
- చెలరేగిన ఎకిల్‌స్టోన్, హీలీ
- డబ్ల్యూపీఎల్



హీలీ

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇంకా బోణీకొట్టని బెంగళూరు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన పోరులో అలీసా హీలీ (47 బంతుల్లో 96 నాటౌట్; 18 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీల విధ్వంసంతో యూపీ వారియర్స్ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు 19.3 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ స్మృతి మంధాన (4) నిరాశపర్చగా, సోఫీ డివైన్ (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలైస్ పెర్రీ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 44 పరుగులు జత చేశారు. అయితే జట్టు స్కోరు 73 పరుగుల వద్ద సోఫీ అవుటయ్యాక పరిస్థితి మారింది. పెర్రీ క్రీజులో ఉన్నప్పటికీ అవతలి వైపు నిలబడే బ్యాటరే కరువయ్యారు. కనిక (8), హీథెర్ నైట్ (2), శ్రేయాంక (15), బరేన్స్ (12) ఇలా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ 13 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 139 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ, దేవిక వైద్య (31 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు) ఇంకా 7 ఓవర్లు మిగిలుండగానే అజేయంగా ముగించారు.



ఎకిల్‌స్టోన్

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూజిలాండ్ 162/5

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కష్టాల్లో పడింది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ తొలి ఇన్నింగ్స్ 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (67) అర్ధ సెంచరీ సాధించగా... డరైల్ మిచెల్ (40 బ్యాటింగ్), కాన్వే (30) రాణించారు. కుమార, అసిత చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 305/6తో ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగులకు ఆలౌటైంది. సౌతీ 5, హెన్రీ 4 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్ మరో 193 పరుగులు వెనుకబడి ఉంది.

దక్షిణాఫ్రికా 287/7

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. కెప్టెన్ తెంబా బవుమా (275 బంతుల్లో 171 బ్యాటింగ్; 20 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగగా...ముల్డర్ (42) రాణించాడు. 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన సఫారీ టీమ్‌ను బవుమా ఒంటి చేత్తో ఆదుకున్నాడు. బవుమా, ముల్డర్ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. విండీస్ బౌలర్లలో మేయర్స్, అల్జారి జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 356 పరుగుల ఆధిక్యంలో ఉంది.